క్లుప్తంగా

వినతిపత్రం అందజేత

మహాముత్తారం: పెండింగ్‌లో ఉన్న తమ నాలుగు నెలల జీతాలు ఇవ్వాలని కోరుతూ మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ శ్రీనివాస్‌రావుకు శనివారం గ్రామపంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కారోబార్లు, బిల్ కలెక్టర్లు, మల్టీపర్పస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశీలన

కాటారం: మండలంలోని శంకరాంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జివాకర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ధాన్యం నిల్వలు, కొనుగోళ్లు, రవాణా వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు.

సమీక్షా సమావేశం

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి, సూరారం, రాపెల్లికోట గ్రామాల్లో శనివారం జన ఆరోగ్య సమితి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సూరారం ఆరోగ్య ఉప కేంద్రంను వెల్ నెస్ సెంటర్ గా గుర్తించి ప్రత్యేక సదుపాయాలతో ఆరోగ్య సేవలు అందించేందుకు కావలసిన వైద్య పరికరాలను కొనుగోలు చేసేందుకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో జన ఆరోగ్య సమితి తీర్మాన కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఐకేపీ సెంటర్లకు చెందిన మహిళలు రోజు వారిగా ధర్నా చేసి శనివారం సాయంత్రం ఇళ్లకు ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో లారీ ఆటోను ఢీకొట్టింది. ఆటో కొంతమేరా డ్యామేజీ అయిన వారికి ఏలాంటి ప్రమాదం జరగక పోవడంలో పెద్ద ప్రమాదం తప్పింది.

కుక్కల బెడద నివారించాలి



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కుక్కల బెడదను నివారించాలని కార్యదర్శి సత్యనారాయణకు లేతకరి రాజబాపు శనివారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్, వరంగల్ ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎర్రికుక్కలు గ్రామంలో స్వైర విహారం చేస్తున్నాయని వినతిపత్రలో వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మహాముత్తారం: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జ్ సాంబం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన అవసరం



మహదేవపూర్: అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రతినిధులు

మహదేవపూర్: పర్యావరణ పరిరక్షణపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం అవగాహన కల్పించారు. బ్యానర్‌లతో వీధుల్లో తిరుగుతూ పర్యావరణం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణంపై ప్రతి గ్రామ పౌరుడికి అవగాహన అవసరమని ఇల్లు–పరిసరాలు పచ్చదనం, పరిశుభ్రతతో, గ్రామ శుభ్రతతోనే ఆరోగ్యమని అన్నారు. జీవనశైలిలో మార్పు అవసరమని, పర్యావరణానికి విరుద్ధంగా జీవన విధానాన్ని కొనసాగించడం వల్ల మానవ మనుగడకే ప్రమాదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ గుడాల అరుణ, ఎంపీడీఓ రవింద్రనాథ్, కార్యదర్శి సమ్మయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, నాయకులు, గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



మహాముత్తారం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



చిట్యాలలో..

మహాముత్తారం: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలో పర్యావరణహిత జీవన శైలిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో వ్యాధులు దూరం

చిట్యాల: పర్యావరణ పరిరక్షణతో వ్యాధులను నివారించవచ్చని మండల స్పెషల్ ఆఫీసర్, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఒడితల గ్రామంలో సర్పంచ్ సాంబలక్ష్మి ఆధ్వర్యంలో గ్రీన్ ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మానవ మనుగడ మొక్కలపై ఆధారపడి ఉంటుందని, మొక్కలను నాటి సంరక్షించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, ఏపీవో హాలీం, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో భద్రత చర్యలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ రాంనర్సింహారెడ్డి

భూపాలపల్లి: బ్యాంకు అధికారులు బ్యాంకుల్లో భద్రత చర్యలు తప్పకుండా పాటించాలని భూపాలపల్లి సీఐ రాంనర్సింహారెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని వివిధ బ్యాంకుల బ్రాంచి మేనేజర్లతో పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఏటీఎంలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రతీ రోజు పర్యవేక్షించి పని చేసే విధంగా చూసుకోవాలన్నారు. ఏటీఎంలు, బ్యాంకుల్లో అపరిచిత, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. బ్యాంకుల్లో అలారం పని చేసే విధంగా చూసుకోవాలన్నారు. రూ.2 వేల నోట్లు రద్దు అయిన కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవగాహన కల్పించాలన్నారు. పోలీసుశాఖ పరంగా బ్యాంకులకు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ రాంనర్సింహారెడ్డి వెల్లడించారు.

చెరువులకు మరమ్మతులు చేపట్టాలి



ఈఎన్‌సీలతో మాట్లాడుతున్న పుట్ట మధు

కాటారం: మండలంలోని గూడురు, బస్వాపూర్, వీరాపూర్, ఒడిపిలవంచ చెరువులకు మరమ్మతు చేపట్టి ఆయకట్టు పొలాలకు సాగు నీరందించేలా సహకరించాలని పెద్దపల్లి జడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు ఈఎన్‌సీలు మురళీధర్‌రావు, వెంకటేశ్వర్లును కోరారు. హైదరాబాద్‌లోని జలసౌధలో పుట్ట మధు ఈఎన్‌సీలను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లోని చెరువులకు మరమ్మతు చర్యలు చేపడితే అనేక ఎకరాల భూములు సాగులోకి వస్తాయని ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని బీడు భూములకు సాగు నీరందించి సస్యశ్యామలం చేయాలనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి సంకల్పాన్ని సాధికారం చేయడానికి కృషి చేయాలని కోరారు.

ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్



మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్: యువతి యువకులను మేధో సంపత్తిని గుర్తించి ప్రోత్సహించడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... క్విజ్ కాంపిటీషన్లో పాల్గొనాలంటే జూన్ 1 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. జూన్ 2వ తేదీన ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోగజవర్గ పరిధిలో మొదటి బహుమతి ల్యాప్ టాప్, రెండవ బహుమతి స్మార్ట్ ఫోన్, మూడవ బహుమతి టాబ్లెట్ బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రోత్సాహ బహుమతుల కింద పది స్మార్ట్ వాచ్‌లు, 10 ఇయర్ పార్ట్స్, 10 హార్డ్ డ్రైవ్లు 10 పవర్ బ్యాంక్స్, ప్రతి నియోజకవర్గంలో మహిళా టాపర్‌గా నిలిచినటువంటి మహిళా అభ్యర్థికి ఎలక్ట్రిక్ బైకును అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తిర్థ సమాచారం కోసం 78933 08756 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, కంచర్ల సదానందం, భువన సుందర్, భూపాలపల్లి రూరల్ అధ్యక్షుడు రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రాజమల్లు(ఫైల్)

టేకుమట్ల: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన మచ్చగిరి రాజమల్లు(70) మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాలుగా హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని, సంవత్సరం క్రితం కాలుకి గాయం కాగా నయం కాక పోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై మండల కేంద్రంలోని తన హోటల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా మృతుడి కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్ల రాజు తెలిపారు.

యువకుడి..

మహాముత్తారం: మద్యానికి బానిసవడంతో తండ్రి మందలించాడని ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మార్క తేజ(26) అనే యువకుడు ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. పలు మార్లు తండ్రి మందలించిన ఆ యువకునిలో మార్పు రాలేదు. యువకుని తండ్రి మద్యం తాగవద్దని మరోసారి మందలించడంతో ఆ యువకుడు ఇంటిసమీపంలోని టెకు చెట్ల వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

ప్రమాదవశాత్తు దగ్ధమైన మొక్కజొన్న

మొగుళ్లపల్లి: మండలంలోని పెద్దకొమటిపల్లి గ్రామానికి చెందిన రైతు మొక్క జొన్నపంట ప్రమాదవశాత్తు అగ్నికి దగ్ధమైంది. బాధిత రైతులు దివాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఇద్దరు రైతులు ఏడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. రెండు రోజుల క్రితం పంట కోసి చేనులో ఆరబెట్టారు. శనివారం పంట చేన్లలో రైతులు చెత్త తగలబెట్టే క్రమంలో ఈదురుగాలులతో నిప్పురవ్వలు ఆరబెట్టిన మొక్కజొన్న పంటపై పడడంతో పూర్తికాలి బుడిదైపోయింది. దీంతో దాదాపు రూ.2లక్షల వరకు పంట నష్టం వచ్చినట్లు బాధిత రైతులు విలపించారు. దగ్ధమైన పంటను వ్యవసాయ అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని సర్పంచ్ మండ సునీల్‌రెడ్డి, పలువురు కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



చిట్యాల: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల(రేగొండ): ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం రేగొండ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పున్నం లక్ష్మిరవి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్ల అందకపోవడంతో ఆర్‌డబ్ల్యూస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణకు చేపట్టిన కటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అగ్రికల్చర్, ఆర్టికల్చర్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ రైతులకు ఆయిల్ పామ్ పంటలతో పాటు, తక్కువ కాలం పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధిహామీ పనులను ఉదయం, సాయంత్రం జరిగేలా చూడాలని, ఉపాధిహామీ పనుల్లో కూలీలకు తగిన సదుపాలయాలను కల్పించాలన్నారు. రేగొండ మండలంలోని జూబ్లీనగర్, గాంధీనగర్, తిరుమలగిరి గ్రామాలు అడవికి సమీపంలో ఉన్నాయి కావున వేసవిలో అటవీకి నిప్పు అంటుకునే ప్రమాదం ఉంది కావున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఇటీవల కురిసిన అకా వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు పంట నష్ట పరిహారం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సాయిని విజయముత్యం, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, తహసీల్దార్ షరీఫ్‌మొహినోద్దీన్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రాంప్రసాద్‌రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం



రేగొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: ఆరుగాలం కష్టపడి పండించిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వరికోల్‌పల్లి, కుమ్మరి పల్లి గ్రామాలలోని 112 మంది రైతులకు రూ.8లక్షల 37వేల విలువ గల చెక్కులను స్వయంగా వారి గ్రామాలకు వెళ్లి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోద, చిట్యాల, టేకుమట్ల జెడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతి రెడ్డి , మండల నాయకులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలని వినతి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

భూపాలపల్లి అర్బన్: బీజేపీ ఎంపీ భూషణ్‌శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని భారత జాతీయ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ మహేష్‌బాబుకు వేయి మహిళల సంతకాలతో కుడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా కార్యదర్శి కోరిమి సుగుణ మాట్లాడుతూ.. మహిళా రేజర్లపై లైంగిక వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. నెల రోజుల నుంచి మహిళా రేజర్లు క్రీడాకారులు ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మహిళా రేజర్లకు న్యాయం జరిగే వరకు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని సుగుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వనిత, లావణ్య, సంధ్య, రజిత, చోటు, షాజియా పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

మహదేవపూర్: చట్టవ్యతిరేక చర్యలు పాల్పడే మావోయిస్టులకు ఎవరైనా సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని కుదురుపల్లిలో శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామాల్లో సోదాలు చేసి ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామంలో మత్తు పదార్థాలైన గంజాయి, గుట్కా, సారా వంటివి విక్రయించవద్దని, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలవ్వొద్దు

కాటారం: యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్సై-2 థామస్‌రెడ్డి సూచించారు. మండలంలోని దేవరాంపల్లి, గంగారం క్రాస్ వద్ద శనివారం పోలీస్ కమ్యూనిటింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామాల్లో అసాంఘీక కార్యక్రమాలు, అసాంఘీక శక్తులకు చోటువ్వొద్దని తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్, సైబర్ క్రైంలకు దూరంగా ఉండాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న నర్సింహమూర్తి

మల్హర్: ఉపాధి పనులు నిర్ణయించిన కొలత ప్రకారం పనులు చేపట్టాలని దీంతో ఎక్కువ వేతనాలు పొందవచ్చని ఎంపీడీఓ నర్సింహమూర్తి ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. మండలంలోని తాడిచర్ల గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల హాజరు శాతాన్ని పరిశీలించి, కొలతల ప్రకారం పనిచేస్తే రూ.272 వస్తుందని కూలీలకు సూచించారు. ఎంపీఓ గిరి హరీష్, టీఏ రమేష్, రాజయ్య పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మూడు ఇళ్లు దగ్ధం

- రూ.40 లక్షల ఆస్తి నష్టం



విద్యుదాఘాతంతో పూర్తిగా కాలిపోయిన ఇల్లు



బోరున విలపిస్తున్న బాధితులు

చిట్యాల: మండలంలోని శాంతినగర్ గ్రామంలో విద్యుదాఘాతంతో మూడు పూరిళ్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నారు. శాంతినగర్ గ్రామానికి చెందిన తల్లి కొడుకులు దానవేని ఐలమ్మ, దానవేని తిరుపతి ఇద్దరు వేరు వేరు ఇళ్లల్లో ఉంటున్నారు. కాగా శనివారం మధ్యాహ్నం సమయంలో కాలిపోయిన వాసన వస్తుందని ఐలమ్మ గ్రహించి ఇంట్లో ఉన్న మనువడు, మనుమరాలికి చెప్పింది. వారు బయటికి వచ్చి చూసే సరికి ఇంటి ముందు పందిరి విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో అంటుకుంది. అంతలోనే గాలిదూమారం రావడంతో రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. దానవేని ఐలమ్మ ఇంట్లో ఉన్న 2 తులాల బంగారం, 15 తులాల వెండి, రూ.20,000 నగదు, అలాగే తిరుపతి ఇంటిలో.. ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న రూ.5లక్షల నగదు, 8 తులాల బంగారం, 30 తులాల వెండి, భూమి కాగితాలు, బట్టలు, వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఈ క్రమంలో తిరుపతి ఇంట్లో ఉన్న సిలెండర్ పేలడంతో నిప్పురవ్వలు ఎగసిపడి ఇంటి ముందు ఉన్న మరోకరి పూరి ఇల్లు చింత నిప్పుల దశరథంకు చెందిన ఇంటికి మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో వస్తువులు, బట్టలు, ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న రూ.10లక్షల నగదు, 2 తులాల బంగారం, 30 తులాల వెండి, 40 క్వింటాళ్ల పత్తి, 5క్వింటాళ్ల బియ్యం, దివ్యాంగుల సైకిల్, డ్రిప్ మిషన్, వైండిగ్ చేసే మిషన్, మరికొన్ని వస్తువులు పూర్తి కాలిపోయ్యాయి. గ్రామస్తుల సహకారంతో కొంతమేరకు మంటలను ఆర్పివేశారు. దిక్కులేక ఎక్కడ ఉండాలో తెలియని దుస్థితి నెలకొందని బాధితులు బోరున విలపిస్తున్నారు. ఇంటి నిర్మాణం చేసుకుని సాజావుగా ఉండేందుకు సమయత్తం అవుతున్న తరుణంలో ఇలాంటి పరిస్థితి రావడంతో పలువురు కంటతడి పెట్టారు. కాగా ఎస్సై ఎండీ షాఖాన్ తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి అక్కడ పరిస్థితిని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. జిల్లా కేంద్రం నుంచి ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలను ఆర్పివేశారు.

సాయం అందించేందుకు కృషి

అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోన బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం బాధితులను పరామర్శించి ప్రమాదాలను గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పదివేల రూపాయాల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వారికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేశారు. ప్రభుత్వం తరుపున సాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బాధితులను ఆదుకోవాలి

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు, బీజేపీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తి రెడ్డిలు డిమాండ్ చేశారు. వారు వేర్వేరుగా పర్యటించి బాధితులకు ఆర్థిక సాయం అందించారు. అలాగే బాధితులకు అయ్యప్ప ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు రూ.40వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న శోభ రఘుపతిరావు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం గుడాడ్‌పల్లి గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ రఘుపతిరావు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.38 లక్షల 40వేలు మంజూరు అయినట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. ఆలయాని నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. సర్పంచ్ ఉడత లక్ష్మిఐలయ్య, ఉప సర్పంచ్ తడుపునూరి స్వప్న వెంకటేష్ పాల్గొన్నారు.